## అభివృద్ధి పేరుతో సామాజిక విధ్వంసం

గోదావరిఖని, మార్చి 27: గోదావరిఖనిలో వారం రోజులుగా పాలకులు, అధికారులు రోడ్డు వెడల్పు, అభివృద్ధి పనుల పేరిట సామాజిక విధ్వంసానికి పాల్పడుతున్నారని సింగరేణి ట్రేడ్ యూనియన్ నాయకులు ధ్వజమెత్తారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. 72 సింగరేణి క్వార్టర్ల తొలగింపు నోటీసులు అందుకున్న బాధితులు సింగరేణి కుటుంబ సభ్యుల సమక్షంలో ఏర్పాటు చేసిన సమావేశానికి వారు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు వెడల్పునకు పట్టణాభివృద్ధికి సహకరిస్తామని, కానీ సింగరేణి క్వార్టర్లను తొలగించాలనే దుశ్చర్యలను మాత్రం ఎట్టి పరిస్థితిలో ఒప్పుకునేది లేదన్నారు. ఏలాంటి అధికారిక ఉత్తర్వులు, లేకుండా చట్ట విరుద్ధంగా కూల్చివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సింగరేణి జీఎం క్వార్టర్ల తొలగింపు నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కంచె చేను మేసిన చందంగా సింగరేణి జీఎం లక్ష్మీనగర్‌కు చెందిన తన బంధువులకు మేలు చేసేందుకే క్వార్టర్ల తొలగింపు నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. దీనికి రామగుండం ఎమ్మెల్యేను సైతం వాడుకొని ప్రజా వ్యతిరేకతను అంటగడుతున్నారని మండిపడ్డారు. టౌన్ ప్లానింగ్‌పై మున్సిపల్ ఆర్జేడీ అనుమతి లేకుండా, సీడీఎంఏ దృష్టిలో లేకుండా ఈ ఏకపక్షమైన నిర్ణయం ఏంటని ప్రశ్నించారు. కార్మిక సంఘాల నేతలు సీఐటీయూ నుంచి తుమ్మల రాజిరెడ్డి, హెచ్ఎంఎస్ నుంచి జక్కుల నారాయణ, బీఎంఎస్ నుంచి ఆకుల హరిన్, ఐఎఫ్‌టీయూ నుంచి కృష్ణ, నరేశ్, తోట వేణు, నంబయ్య, రామస్వామి, దేవయ్య, రాజు, తోట అనసూర్య, కనకమ్మ ఉన్నారు.

## రాజీవ్ రహదారిలో అక్రమ నిర్మాణల కూల్చివేత

రాజీవ్ రహదారి పక్కన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న బల్దియా సిబ్బంది

కోల్‌సిటీ, మార్చి 27: నాలుగైదు రోజులుగా గోదావరిఖనిలోని ప్రధాన వ్యాపార కేంద్రంలో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న నగర పాలక సంస్థ ఇక రాజీవ్ రహదారిపై దృష్టి పెట్టింది. ఈ మేరకు బల్దియా కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ పర్యవేక్షణలో బుధవారం రహదారికి ఆనుకొని చేపట్టిన అక్రమ నిర్మాణాలను సిబ్బందితో తొలగింపజేశారు. నగర సుందరీకరణే లక్ష్యంగా బల్దియా ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ ఆక్రమణల తొలగింపు చినికి చినికి గాలివానగా మారుతోంది. ఎవరి కనుసన్నల్లో ఈ ఆక్రమణల తొలగింపు చేపడుతున్నారనీ? ఇందులో ఎవరికి లాభం, ఎవరికి నష్టమని నలుగురు కూడిన చోట ఇదే చర్చ జరుగుతోంది. లక్ష్మీనగర్‌లో రోడ్డుపై ఉన్న పండ్ల దుకాణాలను ప్రధాన చౌరస్తాలోని ఖాళీ స్థలానికి తరలించగా, ఆ విషయం తెలిసి సింగరేణి అధికారులు ఆ ప్రాంతం తమ ఆధీనంలోనిదనీ, అనుమతి లేకుండా వ్యాపారాలు సాగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. దీనితో పండ్ల వ్యాపారులు గందరగోళానికి గురవుతున్నారు. ఈ క్రమంలో బుధవారం బల్దియా అధికారులు కవితా థియేటర్ నుంచి మొదలుకొని రామగుండం వరకు ప్రధాన రాజీవ్ రహదారి ఆనుకొని ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించారు.

## నేడు మంథనిలో కంటి వెద్య శిబిరం

మంథని, మార్చి 26: ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగస్తుల సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, సింగరేణి, ఆర్టీసీ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘం అధ్యక్షుడు మారుపాక సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి తనుగుల విజయ్ కుమార్, ఆర్థిక కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మంథని నడి వీధిలోని గజానన మండలిలో హైదరాబాద్‌కు చెందిన మెడివిజన్ కంటి దవాఖాన ఆధ్వర్యంలో క్యాంపు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. కంటి చూపు, కంటి నరాలు, లోవిజన్, కళ్లజోడుపరీక్షలు, పిల్లలకు ప్రత్యేక కంటి పరీక్షలు, గ్లకోమా, రెటీనా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పరీక్షలు చేయించుకునే వారు హెల్త్ కార్డులు తీసుకొని రావాలని సూచించారు.

# ఎర్ర బంగారం..రైతుకు భారం

- మిర్చికి దిగుబడి రాక.. రేటు దక్కక అన్నదాత కుదేలు
- కోల్డ్‌స్టోరేజ్ లేక ఇబ్బందులు
- వ్యాపారి అడిగినకాడికి అమ్ముకుంటున్నవైనం

కల్లాల్లో రైతులు ఆరబెట్టిన మిర్చి

ముత్తారం, మార్చ్ 27: ఎర్ర బంగారం ఈ యేడు రైతుల పాలిట భారంగా మారింది. ఆశించిన దిగుబడి రాక..మార్కెట్‌లో రేటు దక్కక రైతాంగం కుదేలవుతున్నది. వ్యాపారి చెప్పిన ధరకే ముట్టజెప్పాల్సి వస్తున్నదని వాపోతున్నది. పండిన పంటను నిల్వ చేసుకొనేందుకు కోల్డ్‌స్టోరేజీలేక నష్టాలపాలవుతున్నది. పెట్టిన పెట్టుబడి కూడా చేతికందే పరిస్థితిలేదని ఆందోళనకు గురవుతున్నది. పంట సాగుకు తెచ్చిన అప్పులు తీర్చేదారిలేక మనోవేదనకు గురవుతున్నది.

పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా సుమారు 760 ఎకరాల్లో ఈ యేడు మిర్చి సాగు చేశారు. ఇందులో ముత్తారం మండలంలోని ముత్తారం, అడవిశ్రీరాంపూర్, ఖమ్మంపల్లి, సీతంపేట, ఇప్పలపల్లిలో 370 ఎకరాల్లో వేశారు. పంట తెగుళ్ల బారిన పడడం, నల్లిరావడంతో ఆశించిన దిగుబడి రాలేదు. తెగుళ్ల నివారణకు ఇబ్బడిముబ్బడిగా పురుగు మందులు వాడినా ఫలితం లేకుండాపోయింది. అంతో ఇంత చేతికివచ్చిన పంటకు సైతం ధర పలకడంలేదు. గతేడాది ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి రాగా ఈ యేడు అందులో సగం కూడా రాలేదు. గతేడాది వండర్‌హాట్ రకానికి రూ. 25 వేల నుంచి రూ. 40వేలు, 341 రకానికి రూ.30 నుంచి రూ.40 వేలు, దేశవాళి కాయకు రూ.60 వేలు, టమాట మిర్చి(దొడ్డు రకం)కి రూ. 70 నుంచి రూ. 90 వేల వరకు ధర పలికింది. నాసిరకం తాలుకు 15 వేలకు అమ్ముడుపోయింది. కానీ ఈ యేడు వండర్ హాట్ కు రూ. 8 నుంచి రూ. 12 వేలు, 341 రకానికి రూ. 10 నుంచి రూ. 15 వేలు, దేశవాళికి రూ. 40 వేలు, టమాట మిర్చికి రూ. 15 నుంచి రూ. 25 వేలు పలుకుతున్నది. రేటు పెరిగినంక పంటను అమ్ముకుందామంటే కోల్డ్‌స్టోరేజ్ కూడా అందుబాటులో లేదు. దీంతో వ్యాపారులు చెప్పిన ధరకే తెగనమ్ముకోవాల్సి వస్తున్నదని రైతులు వాపోతున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను నిలువునా ముంచుతున్నారనే ఆరోపణలు విస్తున్నాయి.

### సర్కారే ఆదుకోవాలె..

ఈ యేడు మిర్చి సాగు చేసిన రైతులకు కొలుకోలేని దెబ్బ తగిలేలా ఉన్నది.

అధిక పెట్టుబడులు పెట్టి పంట సాగు చేస్తే ఆశించిన దిగుబడి రాలేదు. ధర కూడా తక్కువగా ఉన్నది. దీంతో ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి. మిర్చి పంట వేసి నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలె.

- కురాకుల ఓదెలు, (సీతంపేట)

### కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలి..

అరుగాలం కష్టపడి మిర్చి పండించినం. కానీ అమ్ముకుందామంటే మార్కెట్‌లో రేటు పలకడం లేదు. దీంతో పెట్టుబడి కూడా వస్తుందనే నమ్మకం లేదు. కనీసం పంటను దాచుకుందాం అనేకుంటే కోల్డ్ స్టోరేజ్‌లు లేకపోయే..ఉన్న ఒకటి రెండూ వ్యాపారులే బుక్ చేసుకున్నరు. దీంతో వ్యాపారి అడిగిన రేటుకే ఇవాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం అలోచించి పంట దిగుబడికి సరిపడా కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయాలె.

- అల్లం దేవేందర్, ముత్తారం మిర్చిరైతు

## పంటలను కాపాడతాం

ధర్మారం,మార్చి27: సాగునీరందిం చి ధర్మారం, ఎండపల్లి, వెల్గటూరు మండలాల్లో రైతులు సాగు చేసిన యాసంగి పంటలను కాపాడతామని ధ ర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం నంది రిజర్వాయర్‌ను సందర్శించారు. నీటి నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన విజ్ఞప్తి మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎల్లంపల్లి నుంచి నీటిని విడుదల చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారని తెలిపారు. ఈ మేరకు రెండు రోజుల పాటు వేంనూర్, నంది పంప్‌హౌస్ ద్వారా నీటిని పంపింగ్ చేయడంతో 0.26 టీఎంసీల నీరు నంది రిజర్వాయర్‌లోకి చేరిందన్నారు. రైతులు ఆందోళన చెందవద్దన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, నేతలు రాజేశం, జగన్మోహన్‌రెడ్డి, రూప్లానాయక్, గంధం మహిపాల్, దేవి జనార్దన్, కాడె సూర్య నారాయణ ఉన్నారు.

## తాగునీటి ఎద్దడి నివారణపై దృష్టిపెట్టాలి

ధర్మారం,మార్చి27: గ్రామాల్లో తా గు నీటి ఎద్దడి నివారణపై దృష్టి పెట్టి ఈ దిశగా తగిన చర్యలు తీసుకోవాలని డీఆర్డీవో మండల ప్రత్యేక అధికారి ర వీందర్ గ్రామాల స్పెషాలఫీసర్లకు సూ చించారు. బుధవారం మండల కార్యాలయంలో డీపీవో ఆశాలతతో కలిసి మిషన్ భగీరథ అధికారులు, జీపీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఎండలు మండుతున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి కొరత రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. జాతీయ గ్రామీణ అవార్డుల కోసం వివరాలు అందించాలని సూచించారు. సమావేశంలో డీఎల్‌పీవో వేణుగోపాల్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్,ఎంపీవో రమేశ్, మిషన్ భగీరథ ఏఈఈ సురేశ్ ఉన్నారు.

## అధ్యక్షుడిగా హరిబాబు

మంథని, మార్చి 27: మంథని బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బుధవారం కేవీఎల్ఎన్ హరిబాబు పదోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ముస్కుల సహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రఘోత్తమ్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా విజయ్‌కుమార్, కోశాధికారిగా ఆంజనేయులు, లైబ్రరీ కార్యదర్శిగా ఆర్ల నాగరాజు, సాంస్కృతిక కార్యదర్శిగా కటకం శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

## మద్యం తాగొద్దన్నందుకు భార్యను హతమార్చాడు

పెద్దపల్లి టౌన్, మార్చి 27: మద్యం తాగొద్దని వారించిన భార్యను హతమార్చాడు. ఈ ఘటనలో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. బుధవారం పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ విలేకరుల ఎదుట నిందితుడిని ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. పెద్దపల్లి సర్కిల్, బసంత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మూరేడుపల్లి కి చెందిన వాళ్ళ రజిత–పున్నంరెడ్డి ఫిబ్రవరిలో అయోధ్య రామమందిరం దర్శనానికి వెళ్లివచ్చారు. అప్పటి నుంచి మద్యానికి దూరంగా ఉన్న పున్నంరెడ్డి మంగళవారం మద్యం మత్తులో ఇం టికి వచ్చాడు. గమనించిన భార్య రజిత నిలదీయడంతో పగపెట్టుకున్న పున్నంరెడ్డి రాత్రి 11 గంటలకు ఇంట్లోని చైన్ ఫ్యానెల్‌తో రజిత తలపై బలంగా కొట్టడంతో అక్కడిక్కడే మరణించింది. రజిత తల్లి వజ్రవ్వ ఫిర్యా దు మేరకు కేసు నమో దు చేసుకొని ద ర్యాప్తు చేపట్టారు. పోలీసులు నిందితుడి కోసం గాలిస్తుండగా ధర్మరాం క్రాస్ రోడ్ వద్ద పట్టుబడ్డాడు. అతడి వద్ద నుంచి చైన్‌ఫానెల్, బైక్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## మహిళ ఆత్మహత్య

కాళ్వశ్రీరాంపూర్, మార్చి27: వెన్నంపల్లికి చెందిన వెల్తురు మణెమ్మ(49) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. మణెమ్మ కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నది. పలు దవాఖానలకు వెళ్లినా నయం కాలేదు. దీంతో మనస్తాపం చెందిన ఆమె సోమవారం రాత్రి పురుగుల మందు తాగింది. కొడుకు ఉపేందర్ గమనించి పెద్దపల్లి దవాఖానకు తరలించాడు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ దవాఖానకు తీసుకెళ్లగా బుధవారం తెల్లవారుజామున పరిస్థితి విషమించి మరణించింది. మృతురాలి మామ సాయిలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఓంకార్ యాదవ్ తెలిపారు.

## యువతి పెళ్లికి చేయూత

రామగిరి, మార్చి 27: మండలంలోని లొంకకేసారానికి చెందిన నాం సాని లక్ష్మి– రాజయ్య కొన్నేండ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. వీరి కూతురు సుస్మిత వివాహం ఈనెల 28న జరగనుందని తెలిసి మాజీ జడ్పీ టీసీ వెంకటరమణారెడ్డి రామ గిరి సేవాసమితి సభ్యుల దృష్టికి తీ సుకెళ్లారు. వెంటనే స్పందించిన దాతలు రూ.7వేలు, క్వింటాల్ బియ్యాన్ని యువతికి పంపిణీ చేశారు. ఇక్కడ మాజీ ఉప సర్పంచ్ వేము కనకయ్య, ఓదెలు ఉన్నారు.

# సమ్మర్ క్యాంపులపై అవగాహన కల్పించాలి

- పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్
- కలెక్టరేట్‌లో వలంటీర్లకు శిక్షణ

ఇఫ్తార్‌కు ముందు ప్రార్థన చేస్తున్న కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ దంపతులు, అదనపు కలెక్టర్

పెద్దపల్లి, మార్చి27: సమ్మర్ క్యాంపులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో సమ్మర్ క్యాంప్ వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వేసవి సెలవుల్లో జిల్లాలోని 100 గ్రామాల్లో 3 నుంచి 5వ తరగతి చదివే విద్యార్థుల కోసం తెలంగాణ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ కలెక్టివ్ ఆధ్వర్యంలో భారత్ దేఖో టీమ్ ద్వారా సమ్మర్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రోజూ ఉదయం 9నుంచి 11గంటల వరకు క్యాంపు ఉంటుందని వెల్లడించారు. క్యాంపులను ఉల్లాసంగా నిర్వహిస్తూ క్రీడలు, నీతి కథలు చెప్పడం, చదువు ప్రాముఖ్యత వివరించడం, నైతిక విలువలపై అవగాహన కల్పించాలని నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ ఆఫీసర్ డాక్టర్ పీఎం షేక్, భారత్ దేఖో టీమ్ సభ్యులు, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

### ఉపవాసంతో ఆధ్యాత్మికత పెంపు

పెద్దపల్లి, మార్చి27: రంజాన్ మాసంలో ఆచరించే ప్రార్థనలు, ఉపవాసం క్రమ శిక్షణ, ఆధ్యాత్మికతను పెంపొందిస్తాయని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అన్నారు. భగవంతుడి ఆశీస్సులతో పరులకు సేవలందిస్తూ శాంతియుతంగా జీవించాలని ఆకాంక్షించారు. బుధవారం కలెక్టరేట్‌లో పని చేసే ముస్లిం, రెవెన్యూ అధికారులకు అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్ ఇచ్చిన ఇఫ్తార్ విందులో కలెక్టర్ దంపతులు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ, పెద్దపల్లి, మంథని ఆర్డీవోలు రంగయ్య, హనుమా నాయక్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్ పాల్గొన్నారు. అంతకుముందు ప్రార్థనలు చేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, FAHIM FATHIMA, W/o. Syed Anwaruddin, R/o. 2-7-579, Mukarampura, Karimnagar, T.S. have Changed My Name as FAHEEM FATHIMA, W/o. Syed Anwaruddin. NT-328852

★I, SHEELAM SAILEKH RAJ, R/o. 10-5-17/1, Kisan Nagar, Karimnagar, T.S. have Changed My Name as SHEELAM VISHWA SAI LEKH RAJ, S/o. Chiranjeevi. NT-328852

★I, ALLADI SHYLEJA, R/o. 3-6-510/1, Subhash Nagar, Karimnagar, T.S. have Changed My Name as ALLADI SHAILAJA, D/o. Alladi Vykuntam. NT-328852

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

## వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

సీతారామ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న చినజీయర్ స్వామి

జ్యోతినగర్, మార్చి 27: ఎన్టీపీసీ భీమునిపట్నంలోని తారామాంజనేయ చంద్రమౌళేశ్వర స్వామి ఆలయం (చిలుకలయ్యగుడి)లో బుధవారం సీతారామ, లక్ష్మణ సమేత రామచంద్ర స్వామి విగ్రహా ప్రతిష్ఠాపన మహోత్సవం చిన జీయర్‌స్వామి చేతుల మీదుగా వైభవంగా జరిగింది. మంగళవారం రాత్రి హోమశాలలో దేవత విగ్రహాలకు పంచకవ్యాలతో జలాధి వాస పూజలు చేసి, మూలవిగ్రహాల కింద యంత్ర ప్రతిష్ఠాపన నిర్వహించిన జీయర్‌స్వామి బుధవారం ఉదయం విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ చేశారు. అనంతరం ఆలయ గోపురంపై సుదర్శన పెరుమళ్లను ప్రతిష్ఠించిన అనంతరం జీయర్‌స్వామి భక్తులకు శ్రీరామచంద్రుడి ప్రవచనాలు వినిపించారు. ఇక్కడ యజ్ఞాచార్యులు నవీన్‌కుమారాచార్య బృందం, జగన్నాథాచార్యులు, అనంతాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు చెప్యాల రామారావు, చెప్యాల కేశవరావు, శరత్‌రావు, సత్యనారాయణరావు, సతీశ్‌రావు, చెప్యాల శ్రీపతిరావు, రావికంటి ఈశ్వర్, వెంకట రామారావు ఉన్నారు.

## ప్రతిష్ఠాపనోత్సవాల్లో మాజీ మంత్రి కొప్పుల

ప్రతిష్ఠాపనోత్సవాల్లో కొప్పుల ఈశ్వర్

జూలపల్లి, మార్చి 27: కుమ్మ రికుంటలో కొత్తగా నిర్మించిన రామా ల యంలో బుధవారం సీతారామలక్ష్మణ సమేత ఆంజేయస్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠా పనో త్సవాలు నిర్వహించారు. మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే విజయ రమణారావు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నేత నల్ల మనోహర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మనోహర్‌రెడ్డి ఆలయ నిర్మాణ మిగులు పనులకు రూ. లక్ష విరాళంగా అందజేశారు. దుర్గా భవానీ ఉత్సవ కమిటీ సభ్యులు రూ. 30 వేల విలువైన గంటలు, హుండి బహూకరించారు. ఇక్కడతాజా మాజీ సర్పంచ్ మేచినేని సంతోష్, ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి, ధూళికట్ట సింగిల్ విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు, ఎంపీటీసీ తమ్మడవేని మల్లేశం, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, మాజీ సర్పంచులు మేచినేని సంతోశ్‌రావు, దారబోయిన నరసింహం ఉన్నారు.

## మాతృమరణాల నివారణకు పటిష్ట చర్యలు

పెద్దపల్లి, మార్చి 27: మాతృ మరణాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో 2023లో మాతృమరణాలపై వైద్యాధికారులతో సమీక్షించారు. ఈ యేడు జిల్లాలో 6 మంది మాతృమూర్తులు మరణించారని వైద్యాధికారులు తెలిపారు. ఇందుకు గల కారణాలను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గర్భిణుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, సెన్సిటివ్ కేసులను గుర్తించి అవసరమైన వైద్య చికిత్స అందించాలని సూచించారు. గర్భిణులను క్షేత్రస్థాయిలో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఫాలోఅప్ చేయాలని, రెగ్యులర్‌గా మందుల వాడకం, పౌష్టికాహారం తీసుకోవడం వంటివి పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కే ప్రమోద్ కుమార్, జడ్పీ సీఈవో కే నరేందర్, డీసీహెచ్ఏఎస్ డా శ్రీధర్, ప్రోగ్రాం అధికారులు కృపాబాయి, వాణిశ్రీ, గైనకాలాజిస్ట్‌లు అరుణ, రమాదేవి, స్రవంతి, విజయ పాల్గొన్నారు.

## ఘనంగా 'గాయత్రి' ఫేర్‌వెల్ డే

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పెద్దపల్లి కమాన్, మార్చి 27: బందంపల్లి స్వరూప గార్డెన్స్‌లో బుధవారం గాయత్రి డిగ్రీ, పీజీ కాలేజీ ఫేర్‌వెల్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యప్రదర్శనలతో సందడి చేశారు. ఇక్కడ గాయత్రి విద్యానికేతన్ కరస్పాండెంట్ అల్లెంకి రజనీ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ ఉన్నారు.

# ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

మాట్లాడుతున్న మంథని ఆర్డీవో హనుమానాయక్

రామగిరి, మార్చి 27: పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని మంథని ఆర్డీవో హనుమానాయక్ సూచించారు. స్థానిక జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీలో గోదావరిఖని ఏసీపీ, కాటారం డీఎస్పీ, రెవెన్యూ, నోడల్ అధికారులు, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంథని నియోజకవర్గంలో ఎన్నికల ఖర్చుల వివరాల పర్యవేక్షణకు జిల్లా ఎన్నికల అధికారి ద్వారా మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు, మూడు స్టాటిస్టికల్ సర్వేవ్‌లైన్స్ టీంలను, వీడియో వీవింగ్ టీం, వీడి యో సర్వేవ్‌లెన్స్ టీం, ప్రతి మండలాని ఒక మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఆఫీసర్, పోలింగ్ స్టేషన్ల పర్యవేక్షణకు 37 మంది సెక్టార్ అధికారులను నియమించినట్లు తెలిపారు. సరిహద్దులో ఏర్పా టు చేసిన చెక్‌పోస్టులను షిఫ్టుల వారీగా పోలీ స్ సిబ్బంది హాజరు, తనిఖీ విషయమై గోదావరిఖని ఏసీపీ, కాటారం డీఎస్పీలతో చర్చించారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా సభలు, సమావేశాలు, ర్యాలీలకు రాజకీయ పార్టీలు ముందస్తుగా అనుమతి తీసుకోవాలని రెండు రోజుల ముందుగానే ఆన్‌లైన్ ద్వారా సువిధ పోర్టల్‌లో దరఖాస్తు సమర్పించాలని కోరారు. ప్రతి బీఎల్‌వో ద్వా రా ఓటరు లిస్టులో అర్హులైన ప్రతి ఓటరు న మోదయ్యేలా చూడాలని, 85 వయస్సుపై బడిన ఓటర్లకు పీడబ్ల్యూడీ ఫారం 12డీలను నిబంధనల మేరకు అందజేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన బాధ్యతలు తహసీల్దార్లు చూసుకోవాలని ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు బూత్ లెవల్ ఏజెంట్లను, ఒక్కో బూత్‌కు ఒక ఏజెంట్‌ను పార్టీ నుంచి నియమించాలని నిర్దేశించారు.

### ఓటు ప్రాధాన్యతపై అవగాహన

రామగిరి, మార్చి 27: సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని బేగంపేటలో ఓటు హక్కు ప్రాధాన్యత, పరిసరాల పరిశుభ్రతపై, బేటి బచావో బేటి పడావోపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళా బృందం ఆట పాటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు జనగామ రాజనర్సు, ఈ పద్మ, కోండ్ర వెంకన్న, ఇల్లందుల మల్లేశం, బుర్ర శంకర్, దీకొండ శ్రావణ్, సలేంద్ర రాజన్న, జిన్నా రమ, రేణుక, శ్రీవల్లి ఉన్నారు.

## వేతనాల కోసం పోరుబాట

పెద్దపల్లి టౌన్, మార్చి 27: పంచాయతీ కార్మికులు వేతనాల కోసం పోరుబాట పడుతున్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 30 నుంచి నిరసన కార్యక్రమాలు చే పట్టనున్నట్లు గ్రామ పంచాయతీ ఎంప్లా యీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీ యూ జిల్లా అధ్యక్షుడు ఎరవెల్లి ముత్యంరావు తెలిపారు. బుధవారం యూనియన్ ఆఫీసులో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్మికులకు రావాల్సిన బకాయిలు తక్షణమే ఇవ్వాలి, కనీస వేతన చట్టం అమలు చేయాలని, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన ప్రకారం వేతనాలు పెంచాలి, కారోబార్, బిల్ కల్టెక్టర్లకు స్పెషల్ స్టేటస్ ఇవ్వాలని, ఫీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యంతోపాటు ఎండవేడిమికి తగినట్లు ఒక్కపూట మాత్రమే జీపీ కార్మికులతో విధులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సర్కారు స్పందించకుంటే మార్చి 30న మండలకేంద్రాల్లో ధర్నాలు,